క్లుప్తంగా

లక్ష్మి మందిరం చెంతకు జగన్నాథుడు



పాలకొండ రూరల్: జగన్నాథుని రథం వద్ద భక్తుల సందడి

జగన్నాథస్వామి రథయాత్ర సోమవారం రాత్రి ముగిసింది. ఈ మేరకు లక్ష్మి మందిరానికి దేవదేవుడిని చేర్చారు. ఈ క్రమంలో ఆలయ ప్రధానార్చకులు విశ్వనాథదాస్ బలబద్ర, సుభద్ర సమేత జగన్నాథునికి విశేష పూజలు చేసి, ఆలయంలో కొలువుదీర్చారు. రథంపై నుంచి స్వామి వారిని ఆలయంలోకి తోడ్కొని వచ్చే సమయంలో భక్తులు చేసిన జై జగన్నాథ నినాదాలు మిన్నంటాయి.

–పాలకొండ రూరల్

10 లీటర్ల సారా స్వాధీనం

సీతంపేట: మండలంలోని దోనుబాయి పోలీస్ స్టేషన్ పరిధి, టిటుకుపాయి సమీపంలో ఓ వ్యక్తి తరలిస్తున్న 10 లీటర్ల సారాను సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ షేక్‌మస్తాన్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి, ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు.

బీఎల్‌వోలకు శిక్షణ

పాలకొండ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎల్‌వోలకు విధుల నిర్వహణపై సోమవారం శిక్షణ ఇచ్చారు. పక్కాగా ఓటర్ల జాబితా తయారీకి చేపట్టాల్సిన చర్యలు, ఓటరు జాబితా రూపొందించడంలో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతిఒక్కరూ చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేయాలని, సక్రమమైన ఓటరు జాబితా తయారీకి కృషి చేయాలని తహసీల్దారు రాధాకృష్ణమూర్తి ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ రవినాయుడు, డీటీ ఎంఎస్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

భామిని: మండలంలోని బత్తిలి వద్ద ఆంధ్రా–ఒడిశా సరిహద్దు చెక్‌పోస్టును బత్తిలి ఎస్ఐ జి.అప్పారావు సోమవారం సందర్శించారు. రికార్డుల నిర్వహణ, పోలీస్ సిబ్బంది పనితీరును పరిశీలించి, అనంతరం అటువైపుగా వచ్చిపోయే వాహనాలను తనిఖీ చేశారు. గంజాయి వంటి మత్తు పదార్థాల రవాణా ఏమైనా జరుగుతుందా అనే కోణంలో వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.

ఎమ్మార్పీఎస్ పతాకావిష్కరణ

భామిని: ఎమ్మార్పీఎస్(మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు..మాదిగల రిజర్వేషన్ సాధనకు మందకృష్ణ చేసిన సేవలను ప్రశంసించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ పతాకాన్ని ఆవిష్కరించి, జై మాదిగ.. జై ఎమ్మార్పీఎస్.. జై మందకృష్ణ అని నినాదాలు చేశారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

వీరఘట్టం: మలయాళస్వామి 66వ పుణ్యారాధన మహోత్సవాలు పురస్కరించుకుని, స్థానిక శాంతి ఆశ్రమంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమలో పాలకొండ, తలవరం, బొడ్లపాడు, పెద్దబుడ్డిడి తదితర గ్రామాల్లోని ఆశ్రమాల స్వామీజీలంతా పాల్గొని, హోమగుండం వద్ద విశేష పూజలు చేశారు. అనంతరం మలయాళస్వామి చిత్రపటాన్ని పురవీధుల్లో ఊరేగించారు.

యూనిఫాం పంపిణీ



యూనిఫాం క్లాత్‌లు అందిస్తున్న ఎంఈవోలు చంద్రశేఖర్, భీముడు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక జీపీఎస్ పాఠశాల విద్యార్థులకు ఎంఈవోలు బి.చంద్రశేఖర్, బి.భీముడు చేతులమీదుగా సోమవారం యూనిఫాం పంపిణీ చేశారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకం కింద విద్యార్థులకు పాఠ్య,నోటు పుస్తకాలతో పాటు యూనిఫాం, షూ, బెల్టులు అందిస్తుండగా, ప్రస్తుతం యూనిఫాం క్లాత్‌లు విద్యార్థులకు అందిస్తున్నట్లు ఎంఈవోలు తెలిపారు.

దేశవ్యాప్త సమ్మెకు ఎస్ఎఫ్ఐ మద్దతు

గుమ్మలక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9వ తేదీన చేపట్టే దేశవ్యాప్త సమ్మెకు ఎస్ఎఫ్ఐ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆ సంఘ గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల నాయకులు ఆరిక గంగారావు, బిడ్డిక అనిల్‌లు సోమవారం తెలిపారు. ప్రజలకు ఉపయోగం లేని విధానాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు తాము ఎప్పుడూ ముందుంటామని స్పష్టం చేశారు. ఈ సమ్మెకు అన్నివర్గాల నుంచి మద్దతు లభిస్తే బాగుంటుందన్నారు.

● బెంబేలెత్తిస్తున్న జ్వరాలు



సీతంపేట మన్యం గిరిజనులను జ్వరాలు బెంబేలెత్తిస్తున్నాయి. ఏ మారుమూల గూడలో చూసినా ఇంట్లో ఒకరిద్దరు సీజనల్ జ్వరాలతో బాధపడుతున్న వారే కనిపిస్తున్నారు. సోమవారం సీతంపేట ఏరియా ఆస్పత్రికి రోగులు పోటెత్తారు. మొత్తం 334 ఓపీలు రాగా, వారిలో 87 మంది జ్వరాలతో బాధపడుతున్నట్లు తేలిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు. పరిస్థితి సీరియస్‌గా ఉండి వైద్యం అవసరమైన వారిని ఇన్‌పేషెంట్లుగా చేర్చుకుని, చికిత్స అందిస్తున్నామని, మిగతా వారికి మందులు ఇచ్చి పంపించేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

–సీతంపేట

● ఇది పంట కాలువ కాదు..రోడ్డే..



ఈ చిత్రంలో కనిపిస్తోంది..సాగునీటి కాలువ అని ఎవరైనా అనుకుంటే పొరబడినట్లే. చూడటానికి ఇదేదో కాలువలా కనిపించినా నిజానికి అది కాలువ కాదు..రోడ్డు. ఇది వీరఘట్టం మండలంలోని చలివేంద్రి ఆర్అండ్‌బీ రోడ్డు. వీరఘట్టంలోని సాయినగర్ కాలనీ వరకు ఉన్న ఈ రోడ్డు అయ్యప్ప రైస్‌మిల్లు వద్ద పూర్తిగా ధ్వంసమైంది. దీంతో ఏ చిన్నపాటి వర్షం కురిసినా పెద్దఎత్తున వరదనీరు రోడ్డు మధ్యలోని గుంతల్లో ఉండిపోయి ఇలా కనిపిస్తోంది. వర్షాలు లేనప్పుడే ఈ రోడ్డులో ప్రయాణమంటే వెనకంజ వేసేటోళ్లు..ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు..ఆపై వరదనీటిలో ఈ రోడ్డు మీదుగా వెళ్లాలంటే నరకయాతన పడుతున్నామని వాహనదారులు, పాదచారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, రోడ్డు బాగు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

–వీరఘట్టం

సమస్యల పరిష్కారానికి 42 వినతులు



వినతులు పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 42 వినతులు వచ్చాయి. వీటిలో కొన్ని పరిశీలించగా కుట్టుమిషన్ కావాలని మోహన్ కాలనీకి చెందిన సవర సరస్వతి, గ్రామంలోని పాఠశాలకు వంటగది నిర్మించాలని ముకుందాపురానికి చెందిన భాస్కరరావు వినతిపత్రాలు సమర్పించారు. వీరితో పాటు నూకాలమ్మగూడ గ్రామస్తులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు ఏర్పాటు చేయాలని, పవర్‌టిల్లర్, స్ప్రేయర్లు మంజూరు చేయాలని జి.రమేష్ కోరారు. కంప్యూటర్ కాటా మంజూరు చేయాలని తురాయిమానుగూడ సవర మాసయ్య, కొత్తగూడ గ్రామస్తురాలు సొంబారమ్మ పింఛన్ ఇప్పించాలని, కొత్తకోటకు చెందిన ఇందు సీసీడీపీ రుణం మంజూరు చేయాలని వినతులు అందించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు, డీడీ అన్నదొర, డిప్యూటీ ఈవో రామ్మోహన్‌రావు, ఏపీడీ శ్రీహరి, పీహెచ్‌వో గణేష్ తదితరులు పాల్గొన్నారు.

భామిని: మండల కేంద్రంలో సీనియర్ సహాయకుడు బాలరాజు ఆధ్వర్యంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ వేదిక బోసిపోయింది. గ్రామాల నుంచి వచ్చే ఫిర్యాదుదారులు నేరుగా సచివాలయాల్లో వీఆర్‌వోలకు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేయడంతో ఫిర్యాదుదారులు తిరిగి వెళ్లిపోయారు.

భగ్గుమన్న దళిత సంఘాలు



పాలకొండ మండల కేంద్రంలో ఆందోళన చేస్తున్న దళిత సంఘాల నాయకులు, తదితరులు

విద్యుత్ బిల్లులు చెల్లించాలన్న ప్రభుత్వ ఆదేశాలపై దళిత సంఘాలు భగ్గుమన్నాయి. ఇదివరకు 200 యూనిట్ల వాడకం వరకు దళితులకు కరెంట్ ఉచితం కాగా ప్రస్తుత విద్యుత్ బిల్లులతో పాటు పెండింగ్ బిల్లులు కూడా ప్రభుత్వం చెల్లించాలని చెబుతుండడంపై దళిత సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఇదే విషయంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ పాలకొండ మండల కేంద్రంలో పలు ప్రాంతాల దళితులు, దళిత సంఘాల నాయకులు సోమవారం ధర్నా చేపట్టారు. ఎప్పటిలాగే తమకు ఇస్తున్న ఉచిత కరెంట్ సదుపాయం కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఏఈవో విజయలక్ష్మి, ఏఈ రమేష్‌లకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు రమణారావు, దళిత సంఘాల నేతలు బి.మోహనరావు, జి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

–పాలకొండ

కొత్త సచివాలయ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలి



కొత్త భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో ధర్మారావు

జియ్యమ్మవలస: మండలంలోని డంగబద్ర గ్రామంలో కొత్తగా నిర్మించిన సచివాలయ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు ఎంపీడీవో ధర్మారావును కోరారు. ఈ మేరకు ఎంపీడీవో సోమవారం ఆ సచివాలయ భవనాన్ని పరిశీలించి, కాంట్రాక్టరుతో మాట్లాడారు. రూ.16 లక్షలు పెండింగ్ ఉండడంతో భవనం అప్పగించలేదని కాంట్రాక్టరు తెలుపగా, బిల్డింగ్‌లోని దిగువ అంతస్తు సచివాలయానికి ఇవ్వాలని కోరగా సదరు కాంట్రాక్టరు అంగీకరించినట్లు తెలిపారు. విద్యుత్ మీటరు ఏర్పాటు చేయాలని కార్యదర్శికి చెప్పారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

జియ్యమ్మవలస: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ అనీష్ సూచించారు. మండలంలోని తుంబలి రోడ్డులో వాహన తనిఖీలు చేపట్టిన ఆయన.. అటువైపుగా వచ్చే వాహనదారులను ఆపి వారికి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం, సిగరెట్ వంటి మత్తు పదార్థాల వల్ల అనే దుష్ప్రభావాలు కలుగుతాయని, వాటికి బానిసలైతే జీవితం నాశనమైతుందన్నారు. ప్రతిఒక్కరూ మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఉత్తమ జీవనం సాగించాలని కోరారు.

పరామర్శ



గణపతిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి తదితరులు

పాలకొండ: స్థానిక పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త గుడ్ల గణపతిని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సోమవారం పరామర్శించారు. అనారోగ్యం బారిన పడిన కారణంగా గత కొన్ని రోజులుగా గణపతి చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న సదరు నేతలు..ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్యంపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దుప్పాడ పాపినాయుడు, నీలాపు శ్రీనివాసరావు, కడగల రమణ, కనపాక సూర్యప్రకాష్‌రావు, వెలమల మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలోని ఇసుకగెడ్డకు చెందిన అడ్డాకుల అప్పలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆమె మనుమడు ఎంపీటీసీ హరిప్రసాద్‌ను పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సోమవారం పరామర్శించారు. అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న విజయలక్ష్మిని కూడా కలిసి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆమె వెంట సర్పంచ్ సిమ్మయ్య తదితరులు ఉన్నారు.

సెంట్రలైజ్డ్ కిచెన్ ప్రతిపాదనను విరమించుకోవాలి



మాట్లాడుతున్న సీఐటీయు నాయకుడు రమణ

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా తీసుకువస్తామనుకుంటున్న సామూహిక వంటశాలల(సెంట్రలైజ్డ్ కిచెన్) ప్రతిపాదన విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ అన్నారు. మండలంలోని ఉల్లిభద్ర, గరుగుబిల్లి, రావుపల్లి, కొత్తూరు తదితర గ్రామ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిర్వాహకులతో సోమవారం సమావేశమైన ఆయన.. రాష్ట్ర ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో మధ్యాహ్న భోజన పథకంలో గందరగోళ పరిస్థితి నెలకొందన్నారు. 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వమే ఈ ప్రతిపాదనను తీసుకువచ్చినప్పుడు మధ్యాహ్న భోజన నిర్వాహకులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తు చేశారు. మళ్లీ సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిని అడ్డుకోవాలన్నారు. ఇదిలా ఉండగా, కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9వ తేదీన చేపట్టే దేశవ్యాప్త సమ్మెలో అందరూ పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

10న మెగా పేరెంట్స్ డే

సీతంపేట: అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్ డే ఈ నెల 10వ తేదీన నిర్వహించాలని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఈ నెల 8న విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య కార్డులు పంపిణీ చేయాలన్నారు. సమావేశానికి హాజరయ్యే తల్లిదండ్రులకు, అతిథులకు ఆటల పోటీలు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులకు సమగ్ర ప్రగతి పత్రాలు కూడా అందించాలన్నారు. అలాగే పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు.

త్వరితగతిన కళాశాల నిర్మాణం పూర్తి చేయండి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాంలోని టేకరగండి వద్ద నిర్మాణ దశలోని ఇంజినీరింగ్ కళాశాలను త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న కోరారు. సోమవారం ఆ ప్రాంతానికి వెళ్లిన ఆయన కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా నిర్మాణం పూర్తికాపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విద్యా సంవత్సరం నాటికి గిరిజనులకు ఇంజినీరింగ్ విద్య అందిస్తారని అందరూ భావించారని, ఇలా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



గర్భిణుల ఆరోగ్యంపై ఆరాతీస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి వినోద్‌కుమార్

గరుగుబిల్లి: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని జిల్లా ప్రోగ్రాం అధికారి ఎం.వినోద్‌కుమార్ సూచించారు. మండలంలోని ఉల్లిభద్ర గ్రామంలోని హెల్త్ వెల్‌నెస్ కేంద్రాన్ని ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ, రోజువారీ ఓపీ వివరాల నమోదు, ఆరోగ్య పరీక్షలు, మందుల నిల్వలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. దీర్ఘకాలిక రోగుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని, సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని, గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆస్పత్రిలోనే సాధారణ ప్రసవానికి గర్భిణులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో గరుగుబిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోష్‌కుమార్, సూపర్‌వైజర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఏర్పాటు చేయండి



తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న గుమ్మడింగి గ్రామస్తులు

కొమరాడ: మండలంలోని గుమ్మడింగి గ్రామానికి పాఠశాల ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకుడు కొల్లు సాంబమూర్తి, గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ఇదే విషయమై వారు మండల కేంద్రానికి సోమవారం వెళ్లి, తహసీల్దారు సీహెచ్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామానికి రోడ్డు లేదని కొండపైనుంచి ప్రతిరోజూ 10 కిలోమీటర్ల దూరాన ఉన్న ఎండభద్ర గ్రామానికి విద్యార్థులు వెళ్లాల్సి వస్తోందన్నారు. తక్షణమే చొరవ తీసుకుని, గ్రామంలో పాఠశాల ఏర్పాటయ్యేలా చూడాలని వారు కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాళ్లరిగేలా తిరుగుతున్నా.. పింఛన్ ఇప్పించండయ్యా..!



వీరఘట్టం: కాళ్లరిగేలా తిరుగుతున్నా..పింఛన్ మంజూరు చేయడం లేదని వీరఘట్టం ప్రాంతానికి చెందిన బొద్దాన గంగమ్మ ఆవేదన వ్యక్తం చేస్తోంది. గతేడాది మే నెలలో తన భర్త చనిపోయారని, ఆయనకు ఇచ్చిన పింఛన్‌ను తనకు ఇప్పించాలని ఏడాది కాలంగా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతోంది. తన సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరించాలని కోరుతోంది.

9న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి

పాలకొండ: స్థానిక ఏఎంజీ ఫంక్షన్ హాల్ వద్ద ఈ నెల 9వ తేదీన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతిలు తెలిపారు. ఇదే విషయమై వారు మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. స్థానికంగా పార్టీ బలోపేతం, పార్టీ మరింత అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించడం జరుగుతుందని, నియోజకవర్గంలోని సీతంపేట, పాలకొండ, వీరఘట్టం, భామిని మండలాల నుంచి పార్టీ శ్రేణులంతా హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కనపాక సూర్యప్రకాష్‌రావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు వెలమల మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలకు మౌలిక వసతులు కల్పించండి



సబ్‌జైలు పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా న్యాయ సేవాధికారి హరిబాబు

పాలకొండ: ఖైదీలకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని మౌలిక వసతులను అందివ్వాలని జిల్లా న్యాయ సేవాధికారి కె.హరిబాబు సూచించారు. మండల కేంద్రంలోని సబ్‌జైలును ఆయన సోమవారం సందర్శించారు. ఖైదీలతో ముఖాముఖి మాట్లాడి వారికి కల్పిస్తున్న సదుపాయాలను గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు తాగునీరు, భోజనం, వసతి సౌకర్యాలు పక్కాగా ఏర్పాటు చేయాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని జైలు అధికారి జోగులను ఆదేశించారు. ఆయన వెంట మండల న్యాయసేవాధికారి సీహెచ్ హరిప్రియ, న్యాయవాదులు సింహాచలం, వెంకటేశ్వరరావు, ఆనందరావు తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



రోగులకు సేవలందించేందుకు వేచి ఉన్న వైద్య సిబ్బంది

సీతంపేట: మండలంలోని కుశిమి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కుడ్డపల్లి, చిన్నకంబ గ్రామాల్లో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యుడు శివశంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శిబిరానికి వచ్చిన వారికి సిబ్బంది ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం జ్వరపీడితులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే, క్షయ నిర్మూలన ర్యాలీ, డెంగీ మాసోత్సవ ర్యాలీ చేశారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, అలాంటప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని వైద్య సిబ్బంది సూచించారు.

కార్యక్రమంలో సర్పంచ్ నర్సమ్మ, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ జె.మోహనరావు, గ్రామ కార్యదర్శి పాపారావు, ఎంపీహెచ్ఈ వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పీ వాసవి పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో ఎరువులు సరఫరా చేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ ఆదినారాయణ

సీతంపేట: సకాలంలో ఎరువులు సరఫరా చేయాలని ఎంపీపీ ఆదినారాయణ కోరారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని తన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇదివరకే విత్తనాలు, ఎరువులు రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ అయ్యేవని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవేళ ఎక్కడో పంపిణీ జరిగినా అరకొరగా పంపిణీ చేస్తున్నారన్నారు. పలు గ్రామాల్లో వరి విత్తనాలు సరిపోవడం లేదన్నారు. చిన్నపల్లంకి, పుబ్బాడ తదితర పంచాయతీ పరిధిలోని రైతులకు సరిపడ విత్తనాలు ఇప్పటివరకు సరఫరా కాలేదన్నారు. కనీసం కందులు, రాగులు వంటి విత్తనాలు కూడా రాయితీపై పంపిణీ చేయలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు పూర్తి స్థాయిలో పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వ్యవసాయ పరిశోధనా స్థానం కార్యాకలాపాలు కూడా పెద్దగా లేవన్నారు. రైతులకు సూచనలు, సలహాలు కూడా ఎవరూ ఇవ్వడం లేదన్నారు. కొత్త వంగడాలు సృష్టించడం, రైతులకు ప్రత్యేక శిక్షణలు శూన్యమన్నారు. ఇప్పటికైనా రైతుల సంక్షేమం కోసం కృషి చేయాలని కోరారు.

సమ్మె నోటీసు అందజేత



సమ్మె నోటీసు అందిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, సీఐటీయూ నాయకులు

పాలకొండ: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9వ తేదీన చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన నోటీసును ఎంఈవో కార్యాలయ సిబ్బందికి మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం అందజేశారు. ఆ సంఘ నాయకురాలు కె.గౌరమ్మ మాట్లాడుతూ తమకు వేతనాలు సక్రమంగా చెల్లించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా చార్జీలు అందివ్వాలని కోరారు. కార్యక్రమంలో దుర్గమ్మ, బి.చిన్నమ్మడు, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

10న జిల్లా స్థాయి విద్యుత్ వినియోగదారుల సదస్సు

వీరఘట్టం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం వద్ద ఈ నెల 10వ తేదీన జిల్లా స్థాయి విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ఏఈ కె.అనీల్‌కుమార్ ఓ ప్రకటనలో సోమవారం తెలపారు. అధిక విద్యుత్ బిల్లులు, లోఓల్టేజీ, హైఓల్టేజీ సమస్యలు, తరచూ విద్యుత్ సరఫరా అంతరాయం, మరే ఇతర విద్యుత్ సమస్యలు ఉన్నవారు ఈ సదస్సుకు హాజరై, సమస్యలు చెప్పుకోవాలన్నారు. అనంతరం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.